క్లుప్తంగా

కాకినాడ విద్యార్థులకు నాట్యసాయి పురస్కారాలు



నాట్యసాయి అవార్డులు స్వీకరిస్తున్న విద్యార్థులు

కాకినాడ కల్చరల్: కాకినాడకు చెందిన బాలా త్రిపుర సుందరీ నృత్యనికేతన్ విద్యార్థులు నాట్యసాయి పురస్కారాలు పొందారు. షిర్డీలోని సాయిబాబా ఆలయ ప్రాంగణంలో శ్రీషిర్డీసాయి ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన శ్రీసాయి నాథుని నృత్య నీరాజనంలో పాల్గొని ప్రేక్షకులను అలరించారు. వీరు భామాకలాపం, తాండవకేళి, నరసింహదండకం తదితర నృత్యరూపకాలు ప్రదర్శించారు. నృత్యనీరాజనంలో పాల్గొన్న సౌమ్య ,శ్రీలౌక్య, జియా సుప్రజ, బిందు, యశస్వి, మంజు, దేవీ, ఐశ్వర్య తదితర విద్యార్థులకు నాట్యసాయి పురస్కారాలను ప్రదానం చేసి సత్కరించారు. నృత్యనికేతన్ నాట్యాచార్య బేతాసత్యనారాయణను సత్కరించారు.

రాజా రామ్మోహన్‌రాయ్ జయంతి



రాజా రామ్మోహన్‌రాయ్ చిత్రపటానికి బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో నివాళి

కాకినాడ రూరల్: సంఘ సంస్కర్త రాజా రామ్మోహన్‌రాయ్ జయంతిని సర్పవరం జంక్షన్‌లోని బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. రాజా రామ్మోహన్‌రాయ్ చిత్రపటానికి విశ్రాంత తహసీల్దార్ రేలంగి బాపిరాజు, రాఘవరావు, అడబాల రత్నప్రసాద్, సత్యనారాయణ నివాళులర్పించారు. ఈ సందర్భంగా విశ్రాంత తహసీల్దారు బాపిరాజు మాట్లాడుతూ సాంఘిక దురాచారాలను రూపుమాపడానికి రాజా రామ్మోహన్‌రాయ్ కృషి చేశారన్నారు.

దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న డాక్టర్ అడ్డాల

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో కొప్పిశెట్టి సురేష్, అనిత దంపతుల సహకారంతో వృద్ధులకు సోమవారం దుస్తులు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టరు అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ వృద్ధులకు సేవ చేయడం అదృష్టమన్నారు. వేసవి ఎండలు ఎక్కువగా ఉన్నందున జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అడబాల రత్నప్రసాద్, డాక్టరు శిరీష, డాక్టరు కుమార్ యాదవ్, రాజా పాల్గొన్నారు.

జీవ వైవిధ్యానికి కృషి

కాకినాడ రూరల్: భూమిపై ఉన్న ప్రతి జీవి మానవుడికి ఏదో ఒక రూపంలో ఉపయోగపడుతున్నందున వాటిని కాపాడుతూ జీవ వైవిధ్యానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని న్యాయవాది రవిశంకర్ పట్నాయక్ పేర్కొన్నారు. ప్రపంచ జీవ వైవిధ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సర్పవరం జంక్షన్‌లో బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని జీవవైవిధ్యం, దానిని కాపాడుకోవడం గురించి వివరించారు. అడబాల రత్నప్రసాద్, ఓం నమశ్శివాయ, రేలంగి బాపిరాజు పాల్గొన్నారు.

సకాలంలో వాకింగ్ ట్రాక్ పనులు

కరప: గ్రామంలోని సామూహిక రక్షిత మంచినీటి చెరువు చుట్టూ నిర్మిస్తున్న వాకింగ్ ట్రాక్ పనులు సకాలంలో పూర్తిచేయాలని కాకినాడ రూరల్ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ సూచించారు. కరపలో సోమవారం ఆయన పర్యటించి, వాకింగ్ ట్రాక్ నిర్మాణ పనులు పరిశీలించి, కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేశారు. ఎంపీడీఓ కర్రె స్వప్న, మండల ఇంజినీరింగ్ అధికారి జి.శైలజ, జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, సర్పంచ్ సాదే ఆశాజ్యోతి పాల్గొన్నారు.

కాంట్రాక్టు లెక్చరర్ల సర్వీస్ రెగ్యులరైజ్ చేయాలి

కాకినాడ సిటీ: గత 23 ఏళ్లుగా ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తున్న అధ్యాపకుల సర్వీసు రెగ్యులరైజ్ చేయాలని కాకినాడ జిల్లా కాంట్రాక్టు లెక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ రబ్బానీ గౌస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గొర్ల మాణిక్యం ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం యూటీఎఫ్ భవన్‌లో జిల్లా కమిటీ విస్తృతి స్థాయి సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి 12 నెలలు రెన్యూవల్ ఇస్తూ వచ్చిందని, అయితే ఈ ఏడాది 10 నెలలు మాత్రమే ఇస్తామని అధికారులు చెబుతున్నారన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులుగా ఎన్నికైన పేర్వెల సూర్యనారాయణమూర్తిని, మేడిద సింహాచలాన్ని సత్కరించారు.

వేడి వేడిగా నిల్వ వంటకాల వడ్డన

- హోటళ్ల మాయాజాలం
- శుచి, శుభ్రతలు పట్టని వైనం
- లాభార్జనే ధ్యేయం



కాకినాడలో ఒక హోటల్‌లో వంటనూనెను పరిశీలిస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు



దాడుల్లో అధికారులు గుర్తించిన తినడానికి పనికిరాని నిల్వ ఉంచిన మాంసం (ఫైల్)

బోట్‌క్లబ్: రంగుల హంగామాలు, నోరూరించే రీతిలో ఆకట్టుకునే తీరులో ఆహార పదార్థాలు.. పొగలు కక్కుతున్నట్లు ప్లేట్‌లో వేడిగా కనిపించే రకరకాల వెజ్..నాన్‌వెజ్ డిష్‌లు. ఇవన్నీ మనల్ని ఆకట్టుకోవడానికి హోటళ్లలో చేస్తున్న మాయలు, మోసాలు. కానీ కిచెన్‌లోకి వెళ్లి గమనిస్తే ఒళ్లు జలదరింపజేసే నిజాలు. కళ్లు బైర్లు కమ్మించే వాస్తవాలు. ఆ రోజు మిగిలిపోయిన ఆహార పదార్థాలను ఫ్రిజ్‌లలో నిల్వచేసి తర్వాత సాగించే అమ్మకాలు. వాడేసిన నూనెను మళ్లీ మళ్లీ వాడి వండి వారుస్తున్న వైనాలు. ఇలా ప్రజల్ని మైమరపించి అనారోగ్యం బారిన పడేసే వ్యాపార మాయలు అంతా ఇంతాకాదు. మోసాలు, అక్రమాల విషయం తెలియని మనం ఎంతో ఇష్టంగా లొట్టలేసుకు మరీ ఆహారాన్ని ఆరగిస్తున్నాం. రోగాలను కొని తెచ్చుకుంటున్నాం. ప్రమాదకర దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడుతున్నాం. కాకినాడ సిటీ నియోజకవర్గంలో ఇటువంటి ఆహారాన్ని అమ్మే కర్రీ పాయింట్లు, హోటళ్లు ఉన్నట్లు ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీల్లో తేలింది. నెల రోజుల వ్యవధిలో నగరంలో 20కి పైగా కేసులు నమోదు నమోదయ్యాయి.

పాచిపోయిన పదార్థాలు

కాకినాడ నగరంలో వందకుపైగా వెజ్.. నాన్‌వెజ్ హోటల్స్ నడుస్తున్నాయి. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం డిన్నర్ వరకూ రకరకాల ఆహారాన్ని ఈ విక్రయశాలలు అందిస్తున్నాయి. అయితే వీటిలో పేరుపడ్డ హోటల్స్ కూడా మిగిలిపోయిన ఆహారాన్ని నిల్వ చేసి తర్వాత అందిస్తున్నట్లు అధికారుల దాడుల్లో బహిర్గతమయ్యింది.

బిర్యానీ, చికెన్ ఎప్పటివో?

రాత్రి మిగిలిపోయిన బిర్యానీ, చికెన్‌ను మరుసటి రోజు వినియోగదారులకు విక్రయిస్తున్నారు. ఫుడ్ సేఫ్టీ నిబంధనల ప్రకారం వాటిని మరుసటి రోజు విక్రయించకూడదు. కేవలం పచ్చి మాంసం నిర్ణీత టెంపరేచర్‌లో ఉంచుకోవాలి. కానీ హోటళ్ల నిర్వాహకులు సాధారణ ఫ్రిజ్‌లో నిల్వ ఉంచి మరీ మాంసం మరుసటి రోజు వినియోగదారులకు వండి విక్రయిస్తున్నారు.

ప్రజల ఆరోగ్యానికి జాగ్రత్తలు తీసుకోవాలి



కలుషిత ఆహారం తినటం వల్ల అనారోగ్యం పాలవక తప్పదు. బయట హోటల్స్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల వద్ద తీసుకొనే ఆహారంపై దృష్టి సారించాలి. ముఖ్యంగా మాంసాహారంలో రంగులు కలపడం వల్ల క్యాన్సర్ సోకుతుంది. వంటల్లో వాడే ఫుడ్ కలర్, అజినోమోటో, నిల్వ ఉంచిన మాంసం తినడం వల్ల అనేక రకాలైన వ్యాధులు వచ్చే అవకాశం ఉంది.

– డాక్టర్ చిట్ల కిరణ్, ఎండి, అమృత ఎమర్జెన్సీ ఆసుపత్రి

నిల్వ ఆహార పదార్థాలు విక్రయిస్తే ఫిర్యాదు చేయాలి



నిల్వ ఆహార పదార్థాలు ఎవరైనా విక్రయిస్తే మాకు ఫిర్యాదు చేయాలి. వాటిని ల్యాబ్‌కు పంపి అది నిజమని రిపోర్టులో తేలితే సంబంధింత హోటల్ యజమానిపై చర్యలు తీసుకొంటాం. రంగుమారిన నూనె కూడా వ్యాపారులు ఉపయోగించకూడదు. అలా ఎవరైనా ఉపయోగిస్తే 9989688699 నంబర్‌కు ఫోన్ చేయవచ్చు.

– శ్రీనివాస్, జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి

ఇంటింటికీ కుళాయి



సర్పవరంలో వాటర్ ట్యాంక్‌కు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

- ఎమ్మెల్యే కన్నబాబు
- రూ.249.27 కోట్లతో శంకుస్థాపనలు

కాకినాడ రూరల్: ప్రతి గ్రామంలో ప్రతి ఇంటికి రక్షిత నీటిని అందించడంతో పాటు తాగునీటి ఎద్దడి లేకుండా కోట్లాది రూపాయల నిధులతో ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం, పైప్‌లైన్లు, కుళాయిలను కాకినాడ రూరల్ నియోజకవర్గంలో ఏర్పాటు చేస్తున్నట్టు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. జల జీవన్ మిషన్ నిధులు రూ.249.27కోట్లతో మండలంలోని సర్పవరం భావనారాయణపురం, రేపూరు, కొవ్వూరు గ్రామాలలో ఓహెచ్ఆర్ ట్యాంకులు, పైపు లైన్లు, కుళాయిలు ఏర్పాటు పనులకు సోమవారం కన్నబాబు శంకుస్థాపన చేశారు. సర్పవరంలోని భావనారాయణపురంలో రూ.63.36 కోట్లు, రేపూరులో రూ.57.75 కోట్లు, కొవ్వూరులో రూ.128.16 కోట్లతో తాగునీటి సరఫరాకు పనులు చేపట్టనున్నట్టు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తొలిసారి ఎమ్మెల్యేగా అయిన తరువాత పండూరు సీపీడబ్ల్యూఎస్ స్కీమ్ తీసుకువచ్చామని, దాని ద్వారా చాలా గ్రామాలకు రక్షిత తాగునీటిని అందిస్తున్నామన్నారు. రెండో సారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాక నియోజవర్గంలో అన్ని గ్రామాలలో ఇంటింటికి కుళాయి లక్ష్యంతో వాటర్ ట్యాంకులు నిర్మాణం చేపడుతున్నామన్నారు. తాగునీటి ఎద్దడి లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీదేవి, ఏఈ మారుతి రామ్, సీనియర్ నాయకుడు గోపుశెట్టి బాబ్జీ, సర్పవరం సర్పంచ్ శీలం నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ పుల్ల ప్రభాకరరావు, ఎంపీటీసీ సభ్యులు రాజేష్, సూర్యచంద్ర, రేపూరు సర్పంచ్ నక్కా వీరన్న, కొవ్వూరు సర్పంచ్ పిల్ల చక్రరావు, ఎంపీటీసీ సభ్యురాలు ఊబా నాగమణి పాల్గొన్నారు.

దాత ఆశయాలు మరువలేనివి



నిరుపేద బ్రాహ్మణులకు వస్త్రాలు అందిస్తున్న నాయకులు

బోట్‌క్లబ్: ఎంతో ముందుచూపుతో అలనాడు దాతలు నిరుపేద విద్యార్థులకు భోజన వసతి, ఇతర సదుపాయాలు కల్పించడం గొప్ప విషయమని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న అన్నారు. స్థానిక సినిమారోడ్డులోని మంత్రిప్రగడ వారి సత్రం వ్యవస్థాపకులు మంత్రిప్రగడ నరసింహారావు పంతులు 141 వర్ధంతి సత్రం ఆవరణలో సోమవారం నిర్వహించారు. చదువుకొనేందుకు ఇబ్బందులు పడుతున్న వారికి భోజన వసతితోపాటు స్కాలర్‌షిప్‌లు అందించేందుకు తన ఆస్తిని సత్రానికి రాసి ఇచ్చిన మహనీయుడు మంత్రిప్రగడ నరసింహారావు పంతులు అని కొనియాడారు. మాజీ డిప్యూటీ మేయర్ పసపులేటి వెంకటలక్ష్మి మాట్లాడుతూ దాతల ఆశయాలకు అనుగుణంగా పాలకవర్గ సభ్యులు సేవా కార్యక్రమాలు చేయాలన్నారు. సత్రం చైర్మన్ చిట్నీడి నారాయణమూర్తి మాట్లాడుతూ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి సహకారంతో సేవా కార్యక్రమాలు నిరంతరం చేపడుతున్నామన్నారు. నిరుపేద బ్రాహ్మణులు, మహిళలకు వస్త్రాలు, చీరలు, దుప్పట్లు, అందించారు. ద్వారంపూడి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కర్రి చినబాబు, మాజీ కార్పొరేటర్లు వాసిరెడ్డి రాంబాబు, రాగిరెడ్డి అరుణ్‌కుమార్, సత్రం ఈఓ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

సమ్మర్ క్రికెట్ టోర్నీ విజేత గురజనాపల్లి

రన్నర్స్‌గా కరప వారియర్స్



విజేత జట్టుకు నగదు, ట్రోఫీ అందజేస్తున్న నాయకులు, నిర్వాహకులు

కరప: స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో క్రికెట్ కార్నివాల్ సీజన్–1 విజేతగా గురజనాపల్లి జట్టు నిలిచింది. ఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి విజేత గురజనాపల్లి జట్టుకు రూ.25 వేలు, రన్నర్స్ కరప వారియర్స్ జట్టుకు రూ.15 వేలు వంతున నగదు, ట్రోఫీ అందజేశారు. టోర్నమెంట్‌లో కరప, కాజులూరు మండలాల నుంచి 41 జట్లు పాల్గొన్నాయి. ఫైనల్ మ్యాచ్‌లో గురజనాపల్లి జట్టు టాస్ గెలిచి నిర్ణీత 6 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి 87 పరుగులు చేసింది. తర్వాత ఛేజింగ్‌కు దిగిన కరప వారియర్స్ జట్టు ఆరు వికెట్లు కోల్పోయి 84 పరుగులు చేయడంతో ఓటమి పాలైంది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా వివాకర్(గురజనాపల్లి), బెస్ట్ బ్యాట్స్‌మ్యాన్‌గా సలాది నాగేంద్ర(కరప వారియర్స్), బెస్ట్ బౌలర్‌గా ముద్రగడ అయ్యప్పస్వామి, మోస్ట్ వాల్యూబుల్ ప్లేయర్‌గా సలాది నాగేంద్రకుమార్ బహుమతులు గెలుచుకున్నారు. గ్రామ సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, వైస్ ఎంపీపీ పాట్నీడి భీమేశ్వరరావు, మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు, ఏపీ పంచాయతీరాజ్‌రాజ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రెడ్డిపల్లి రమేష్ పాల్గొన్నారు. టోర్నీ నిర్వాహకులు కరప యూత్ సభ్యులు మేడిశెట్టి దుర్గాకిరణ్, నక్కా భీమశంకర్, విజ్జిన వీరేంద్ర, పాట్నీడి రాజా, ఆచంట స్వరూప్, పోలిశెట్టి సుదీప్, సలాది నాగేంద్ర, పేకేటి దుర్గాప్రసాద్‌లను వైఎస్సార్ సీపీ నాయకులు అభినందించారు.

సముద్ర తీర భద్రతపై మత్స్యకారులకు అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: సముద్ర తీర ప్రాంత భద్రతపై మత్స్యకారులకు విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. జిల్లా స్థాయి సముద్ర తీర భద్రత కమిటీ సమావేశం సోమవారం కలెక్టరేట్‌లో జరిగింది. కలెక్టర్ కృతికా శుక్లా.. విశాఖపట్నం కోస్టల్ సెక్యూరిటీ అదనపు ఎస్పీ జీబీఆర్ మధుసూదన్‌రావు, కాకినాడ అదనపు ఎస్పీ పి.శ్రీనివాసు, కస్టమ్స్, కాకినాడ సీపోర్టు, నేవీ, ఇండియన్ కోస్ట్‌గార్డ్, తీర ప్రాంత పోలీస్ అధికారులతో ఈ సమావేశం నిర్వహించారు. సముద్ర తీర భద్రతకు పోలీస్, మెరైన్, నేవీ, కోస్ట్‌గార్డ్, మత్స్యశాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశించారు. సముద్రంలో ఉన్న బోట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు అవసరమైన వాచ్‌టవర్స్‌ను ఏర్పాటు చేయాలన్నారు. సముద్ర తీర భద్రతకు సంబంధించి అందుబాటులో ఉన్న బోటుల మరమ్మతులకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. వారంతారాలు, ఇతర పండగల సందర్భాల్లో సముద్ర స్నానాలు ఆచరించే సమయంలో ప్రమాదానికి గురైన ప్రజలను సురక్షితంగా ఒడ్డుకు చేర్చేందుకు నైపుణ్యం కలిగిన గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయాలని కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. ఇన్‌చార్జి డీఆర్వో కె.శ్రీరమణి, జిల్లా మత్స్యశాఖ అధికారి పి.సత్యనారాయణ, కస్టమ్ సూపరింటెండెంట్ శివకుమార్, సీపీవో పి.త్రినాథ్, ఇండియన్ కోస్ట్‌గార్డ్ అసిస్టెంట్ కమాండెంట్ జి.యానీలా, ఐబీ డీఎస్పీ ఎస్.నూకరాజు, మెరైన్ సీఐ సుమంత్ పాల్గొన్నారు.

పవర్‌లిఫ్టింగ్ పోటీలలో గొర్రిపూడి యువకుని ప్రతిభ



బంగారు పతకంతో జగన్, పక్కన తెనాలి ఎమ్మెల్యే శివకుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ సాయిరేవతి

కరప: తెనాలిలో ఈనెల 20,21 తేదీలలో జరిగిన రాష్ట్ర సబ్‌జూనియర్, జూనియర్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్, బెంచ్‌ప్రెస్ ఛాంపియన్‌షిప్–2023 పోటీలలో కరప మండలం గొర్రిపూడి యువకుడు మేడిశెట్టి జగన్ ప్రతిభ కనబరిచాడు. బంగారు పతకంతో పాటు ఓవరాల్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్ట్రాంగ్ మ్యాన్ గోల్డ్ మెడల్ సాధించాడు. పవర్‌లిఫ్టింగ్ పోటీలలో 59 కిలోలలో (బాడీవెయిట్)జగన్ స్క్వాట్‌లో 165 కిలోలు, బెంచ్‌ప్రెస్‌లో 105 కిలోలు, డెడ్‌లిఫ్ట్‌లో 207.500 కిలోల విభాగంలో బంగారుపతకం, బెంచ్‌ప్రెస్ పోటీలలో బంగారు పతకం సాధించాడు. ఇంటర్నేషనల్ వెయిట్‌లిఫ్టర్, కామన్‌వెల్త్ గోల్డ్‌మెడలిస్ట్, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఘట్టమనేని సాయిరేవతి, అసోషియేషన్ జిల్లా సెక్రటరీ జి.పుల్లేశ్వరరావు, కోచ్ ఎ.సతీష్ తదితరులసమక్షంలో తాను గోల్డ్‌మెడలు అందుకున్నట్లు జగన్ సోమవారం తెలిపారు.

డ్రైన్లలో పూడిక తీతపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ మహేష్‌కుమార్

కాకినాడ సిటీ: నగరంలోని ప్రధాన డ్రైన్లలో పూడిక తీయడంపై ఇంజినీరింగ్, హెల్త్ విభాగం అధికారులతో నగరపాలక సంస్థ కమిషనర్ మహేష్‌కుమార్ రావిరాల, అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహరావు సోమవారం సమీక్షించారు. పూడికతీత పనుల స్థితిగతులపై ఆరా తీసి ఈ నెల 31వ తేదీ లోపు డ్రైన్లలో పూడికను పూర్తిగా తొలగించాలని ఆదేశించారు. వరదలు సంభవించే ప్రాంతాల్లో స్ప్రింగ్ పోస్టులను కూడా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కల్వర్టులు ముందు ప్రధాన జంక్షన్లలో గ్రేటింగ్‌లు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు.

సైనిక సంక్షేమ పతాక నిధికి విరాళం



కలెక్టర్‌కు డీడీ అందజేస్తున్న జిల్లా, క్లస్టర్ నీటియాజమాన్య సంస్థ సంచాలకులు

కాకినాడ సిటీ: జిల్లా సైనిక సంక్షేమ పతాక నిధికి కాకినాడ క్లస్టర్ నీటియాజమాన్య సంస్థ పథక సంచాలకులు అడపా వెంకటలక్ష్మి, వసంత మాధవి తమ వంతు విరాళంగా రూ.1.19 లక్షలు డీడీ రూపంలో కలెక్టర్ కృతికా శుక్లా ద్వారా సోమవారం అందజేశారు. గొల్లప్రోలు, కాజులూరు, కాకినాడ రూరల్, కరప, పెదపూడి, పిఠాపురం, సామర్లకోట, తాళ్లరేవు, ఉప్పాడ కొత్తపల్లి మండలాల ఉపాధి వేతనదారులు ఒక్కొక్కరి నుంచి రూ. 10 చొప్పున సైనిక సంక్షేమ పతాక నిధికి వసూలు చేసిన మొత్తాన్ని కలెక్టర్ ద్వారా జిల్లా సంక్షేమాధికారికి అందజేశారు.

వీరేంద్ర అదృశ్యం కేసుకు తెర



వీరేంద్ర (పాత్ర చిత్రం)

కాకినాడ రూరల్: కాకినాడ విద్యుత్‌నగర్ నాన్సీ వీధికి చెందిన చలికి వీరేంద్ర అదృశ్యం కేసుకు తెరపడింది. భద్రాచలం వద్ద వీరేంద్రను గుర్తించిన పోలీసులు ఆదివారం రాత్రి కాకినాడ తీసుకువచ్చారు. సర్పవరం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 15న కారులో విజయవాడ వెళ్లిన వీరేంద్ర 18న మధ్యాహ్నం 2.30 గంటల నుంచి కనిపించలేదు. సర్పవరం పోలీసులు ఈ నెల 20న కేసు నమోదు చేశారు. ఆర్థిక లావాదేవీల కారణంగా ప్రత్యర్థులతో ఆయనకు ఏమైనా అయి ఉంటుందా అనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. చివరిగా కొవ్వూరు టోల్‌గేట్ క్రాస్ చేసి మాయమైనట్టు ఫిర్యాదులో పేర్కొనడంతో ఆ దిశగా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఖమ్మం జిల్లాలో ఉన్నట్టు సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకున్నారు. వ్యక్తిగత, ఆర్థిక లావాదేవీల కారణంగా తాను వెళ్లిపోయినట్టు వీరేంద్ర తెలిపారని సీఐ ఆకుల మురళీకృష్ణ తెలిపారు.

సీహెచ్‌వోలకు శిక్షణ

కాకినాడ క్రైం: ప్రాథమిక చికిత్సా విధానాలు, పాముకాట్లకు అందివ్వాల్సిన వైద్య సేవలతోపాటు, పలు వైద్య విధానాలపై మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ల (ఎంఎల్‌హెచ్‌పీ)కు సోమవారం శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో కాకినాడ జీజీహెచ్‌లోని స్కిల్ ల్యాబ్‌లో ప్రారంభమైన ఈ తరగతులకు నోడల్ అధికారిగా అనస్థీషియా హెచ్‌వోడీ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్ వ్యవహరిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని జీజీహెచ్ హెచ్‌వోడీ డాక్టర్ హేమలతాదేవి, ఇండియన్ రీసక్సియేషన్ కౌన్సిల్ ఫెడరేషన్ చైర్మన్ డాక్టర్ ఎస్ఎస్‌సీ చక్రరావు, డాక్టర్ విష్ణువర్ధన్‌లు సంయుక్తంగా ప్రారంభించారు.

నేడు వలంటీర్లకు వందనం

కాకినాడ రూరల్: ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తున్న వలంటీర్లను అవార్డులతో సత్కరించేందుకు ప్రభుత్వం చేపడుతున్న వలంటీర్లకు వందనం కార్యక్రమం కాకినాడ రూరల్ రమణయ్యపేటలో మంగళవారం ఉదయం జరగనుంది. సర్పవరం జంక్షన్ వద్ద స్పందన ఫంక్షన్ హాలులో ఎమ్మెల్యే కన్నబాబు చేతుల మీదుగా వలసపాకల, వాకలపూడి, సూర్యారావుపేట, తమ్మవరం, నేమాం, పెనుమర్తి, పండూరు, పి.వెంకటాపురం, తిమ్మాపురం, రమణయ్యపేట, సర్పవరం గ్రామాలకు చెందిన వలంటీర్లను సత్కరించనున్నారు.

ఎన్టీయార్ ఆశయాలు కొనసాగిస్తాం

కాకినాడ సిటీ: దివంగత ఎన్టీఆర్ ఆశయాలను కొనసాగిస్తామని టీడీపీ నేతలు పేర్కొన్నారు. సోమవారం కాకినాడ సూర్యకళామందిరంలో నిర్వహించిన మినీ మహానాడులో టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు, జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్ మాట్లాడారు. ఎన్టీయార్, వరుపుల రాజా చిత్రపటాలకు నివాళులర్పించారు. నాయకులు బండారు సత్యనారాయణమూర్తి, దేవినేని ఉమామహేశ్వరరావు, జ్యోతుల నెహ్రూ, చిక్కాల రామచంద్రరావు, వనమాడి వెంకటేశ్వరరావు, పిల్లి అనంతలక్ష్మి, ఎస్‌వీఎస్ఎస్ వర్మ పాల్గొన్నారు. పలు తీర్మానాలు ఆమోదించారు.

స్పందన ద్వారా ఆరుగురికి ఉద్యోగాలు



కృతజ్ఞతగా కలెక్టర్ కృతికా శుక్లాకు మొక్కను అందజేస్తున్న యువతీయువకులు

కాకినాడ సిటీ: స్పందన కార్యక్రమంలో దరఖాస్తులు చేసుకున్న ఆరుగురు అభ్యర్థులకు వివిధ సంస్థల్లో వికాస ద్వారా ఉద్యోగాలు కల్పించారు. ఉద్యోగాలు పొందిన అభ్యర్థులు సోమవారం కలెక్టర్ కృతికాశుక్లాను కలుసుకొని ధన్యవాదాలు తెలిపారు. కేపిటల్ కన్సల్టెన్సీ కంపెనీలో సిస్టమ్ ఆపరేటర్ ఉద్యోగానికి సరిత, ఇన్‌చార్జిగా టీకే చక్రవర్తి ఎంపికయ్యారు. ఎనిస్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్‌లో నవీన్ బెంచ్‌సేల్స్ ఉద్యోగానికి, శ్రీరామ్ చిట్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లో వి.శివశంకర్, కె.నాగ సుబ్రహ్మణ్యం బీడీవోగా నెలకు రూ. 15వేలు జీతంతో నియమితులయ్యారు. శ్రీనిధి అసోసియేట్స్ కంపెనీలో రికవరీ ఆఫీసర్‌గా డీవీ రాజశేఖర్ నెలకు రూ. 13 వేలు జీతంతో ఉద్యోగం ఇచ్చారు. కార్యక్రమంలో జేసీ ఇలక్కియ, డీఆర్వో కె.శ్రీరమణి, వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె. లచ్చారావు పాల్గొన్నారు.

కథల ద్వారా భావ వ్యక్తీకరణ



బాలసాహిత్యం పుస్తకాలను తిలకిస్తున్న విద్యార్థులు

కాకినాడ సిటీ: విద్యార్థులు కథలు వినడం, చదవడం ద్వారా భావవ్యక్తీకరణ నైపుణ్యాలు అలవాడతాయని బాల మందిరం వ్యవస్థాపక అధ్యక్షుడు అంగర గోపాలకృష్ణ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో కాకినాడ గాంధీనగర్ శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం 15వ రోజు సోమవారం కథలు, భావవ్యక్తీకరణ అంశంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. కథలు.. భాషాభివృద్ధికి, భావవ్యక్తీకరణకు దోహదపడతాయని విద్యార్థులు కథా సాహిత్యం చదవాలని కోరారు. గుమ్మడూడి సావిత్రి ప్రసాద్ విద్యార్థులకు చక్కని కథలు వినిపించి ఆనంద పరవశులను చేశారు. డ్రాయింగ్ మాస్టారు పి.వీరబాబు విద్యార్థులకు చిత్రలేఖనంపై శిక్షణ తరగతులు నిర్వహించారు. గ్రంథాలయంలో బాల సాహిత్యం పుస్తకాలతో ఏర్పాటు చేసిన ప్రదర్శనను బాలబాలికలు ఆసక్తితో తిలకించారు. లైబ్రేరియన్ ములకంపాక శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గాయపడిన కెమెరామన్‌కు సాయం

కాకినాడ సిటీ: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న ఓ టీవీ చానల్ కెమెరామన్ సప్పా శ్రీనివాస్‌కు కాకినాడ జర్నలిస్టులు సోమవారం రూ.30 వేల ఆర్థికసాయం, మరో 20 వేలు విలువ చేసే నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ నెల 11న కరప వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీనివాస్‌కు ఎడమ కాలు మోకాలు కింద రెండు ఎముకలు విరిగిపోయాయి. ఆపరేషన్ చేయడంతో 6 నెలల పాటు ఇంటి వద్దే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. జర్నలిస్టులు ఎస్‌కే దుర్రానీ, శివన్నారాయణరెడ్డి, అంజిబాబు, మంగా వెంకటశివరామకృష్ణ, చింతా దొరబాబు యువజన సంఘం ప్రతినిధి రాజేష్ శ్రీనివాస్‌కు అందజేశారు.

గర్భిణుల్లో రక్తపోటుపై ర్యాలీ

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్ ప్రసూతి వైద్య విభాగం ఆధ్వర్యంలో గర్భిణుల్లో రక్తపోటు నివారణ (ప్రీ ఎక్లంప్సియా– గుర్రపువాతం)పై అవగాహన ర్యాలీ జరిగింది. సోమవారం అంతర్జాతీయ ప్రీ ఎక్లంప్సియా దినోత్సవం సందర్భంగా జరిగిన ఈ ర్యాలీ గైనిక్ హెచ్‌వోడీ డాక్టర్ లావణ్యకుమారి, ఫాగ్సీ (ఫెడరేషన్ ఆఫ్ ఒబెస్ట్రిక్స్ అండ్ గైనకాలజీ సొసైటీ ఆఫ్ ఇండియా) కార్యదర్శి డాక్టర్ వానపల్లి గీతశ్రీ ఆధ్వర్యంలో నిర్వహించగా జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ హేమలతాదేవి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ అధిక రక్తపోటు కారణంగా గర్భిణుల్లో మరణాలు సంభవిస్తున్నాయని అన్నారు. ఆరోగ్యకరమైన జీవనశైలి, ఆహారపు అలవాట్లు రక్తపోటును దూరం చేస్తాయని తెలిపారు. ర్యాలీ జీజీహెచ్ నుంచి పూలే విగ్రహం వరకు సాగింది. నర్సింగ్ విద్యార్థులు మానవహారంగా ఏర్పడ్డారు. గైనిక్ విభాగం ప్రొఫెసర్లు, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, పీజీలు, హౌస్ సర్జన్లు, నర్సింగ్ సూపరింటెండెంట్, విద్యార్థులు పాల్గొన్నారు.

మద్యం అమ్ముతున్న ఇద్దరి అరెస్ట్

కరప: పొలాల్లోని కాలువ గట్టు వద్ద మద్యాన్ని అమ్ముతున్న ఇద్దరిని కరప పోలీసులు అరెస్ట్ చేసి, వారి నుంచి మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారు. కరప మండలం అరట్లకట్ట గ్రామశివారులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్టు సమాచారం అందడంతో సోమవారం కరప ఏఎస్ఐ వి.సూరిబాబు సిబ్బందితో వెళ్లి దాడిచేశారు. మద్యం విక్రయిస్తున్న అనసూరి వెంకట్రావును అదుపులోకి తీసుకుని, అతని వద్దనున్న రూ.1,540 లు విలువచేసే పలు రకాల మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. అదే గ్రామంలో కాలువగట్టు వద్ద పితాని అప్పారావు కూడా మద్యాన్ని అమ్ముతున్నట్టుగా సమాచారం రావడంతో ఏఎస్ఐ జి.ప్రసన్నకుమార్ సిబ్బందితో వెళ్లి దాడిచేశారు. నిందితుణ్ణి అదుపులోకి తీసుకుని, రూ.1,290 విలువచేసే వివిధ రకాల మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపైనా కేసు నమోదు చేసినట్టు ఏఎస్ఐ తెలిపారు.

మేల్ నర్సుపై విచారణకు ఆదేశం

కాకినాడ క్రైం: జీజీహెచ్‌లో కాంట్రాక్ట్ విధానంలో పనిచేస్తున్న మేల్ నర్సు పోలాబత్తుల శ్రీనివాసరావు అనుమతి లేకుండా వార్డుల్లో మామిడి పండ్లు పంపకంపై విచారణకు ఆదేశించారు. అతనికి సహకరించిన సెక్యూరిటీ గార్డులు లోవరాజు, శ్రీనివాసు, సత్యనారాయణను విధుల నుంచి తొలగిస్తూ సూపరింటెండెంట్ డాక్టర్ హేమలతాదేవి నిర్ణయం తీసుకున్నారు.